

2024 వెలుగు నీడలు



తొలిసగం విధ్వంసం

మలిసగం నిర్మాణం

విలక్షణమైన కాలానికి సాక్ష్యం 2024వ సంవత్సరం. విభజనతో కునారిల్లుతున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం రెండు భిన్న దృక్పథాలుగల ప్రభుత్వాలను చూసింది. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. కూటమి ప్రభుత్వం 12న బాధ్యతలు స్వీకరించింది. విధ్వంసమే పాలనగా సాగిన కాలానికి రోజులు చెల్లాయి. ఇటుక ఇటుకా పేర్చి పునర్నిర్మాణం మొదలైంది. అయిదున్నర నెలల జగన్ పాలనకూ, చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ఆరున్నర నెలల పాలనకూ ఉన్న తేడాలను జిల్లా ప్రజలు చూస్తున్నారు. వాటి సమాహారమే ఇది...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఆఖరులో అమ్మఒడికి చిల్లు



తొలిసగం: అమ్మఒడి పథకాన్ని చిత్తూరు వేదికగా 2020 జనవరిలో సీఎం జగన్ ప్రారంభించగా.. నాలుగు విడతలు అందించారు. 2023లో 152,542 మంది తల్లులకు రూ.288.81 కోట్లను అందించగా.. 2024 జనవరిలో అందించాల్సిన చివరి విడత సొమ్మును ఎగ్గొట్టేశారు.

మలిసగం: కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తల్లికి వందనం పేరుతో అమలు చేస్తానని చెప్పింది. అయితే ఇంకా ప్రారంభించలేదు.

కాలేజీ పిల్లల ఆకలి చదువులకు స్వస్తి

తొలిసగం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసింది.

మలిసగం: కూటమి ప్రభుత్వం డిసెంబరు నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టనున్నట్టు ప్రకటించింది. దీంతో జిల్లాలోని 31 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని 10,837 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయనున్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారు

తొలిసగం: జగనన్న విద్యా వసతి దీవెనల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేసే మొత్తం చివరి ఏడాది ఎగ్గొట్టేశారు. 2023-24 ఏడాదికి రాష్ట్రవ్యాప్తంగా ఇవ్వాల్సిన రూ.3580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వలేదు.

మలిసగం: కూటమి ప్రభుత్వం పాత బకాయిలను విడుదల చేయడంతో పాటు ఇక నుంచి ఆ నిధుల్ని నేరుగా కాలేజీలకు జమ చేస్తామని ప్రకటించింది.



పంచాయతీలకు ప్రాణం వచ్చింది



తొలిసగం: గ్రామపంచాయతీలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేసింది.చివరకు కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే ఆర్థిక సంఘం నిధుల్ని కూడా వైసీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు మళ్లించేసేది. ఇలా జిల్లాలోని పంచాయతీలకు పలు విడతల్లో వచ్చిన రూ.120 కోట్లను లాగేసుకుంది.

మలిసగం: కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు విడతల్లో రూ.60 కోట్ల ఆర్థిక సంఘం నిధుల్ని జిల్లాలోని 697 గ్రామ పంచాయతీలకు జమ చేశారు.

కూటమి అందించని ఆసరా

తొలిసగం: 'వైఎస్సార్ ఆసరా' లబ్ధి ఈ ఏడాది జనవరి 24వ తేదీన జిల్లా మహిళలకు అందింది. నాలుగో విడత కింద 33,655 గ్రూపుల్లోని 3,10,643 మంది మహిళల ఖాతాల్లో రూ.324 కోట్లు జమయ్యాయి. అలాగే వైఎస్సార్ చేయూత కింద మార్చి 7న జిల్లాలోని 1,04,226 మంది మహిళలకు రూ.195.42 కోట్లను అందించారు. 45-60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నాలుగోసారి రూ.18,750 చొప్పున ఈ ఆర్థిక సాయం చేశారు.

మలిసగం: కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంకా అమలు చేయలేదు.



పింఛను ఒకేసారి వెయ్యి పెరిగింది



తొలిసగం: జగన్.. అవ్వాతాతలకు పింఛను తానే ఎక్కువ ఇచ్చినని చెప్పుకునేవారు. నిజానికి టీడీపీ ప్రభుత్వంలో రూ.2000 ఉన్న పింఛనును అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయన పెంచింది కేవలం వెయ్యి మాత్రమే. అదీ విడతకి రూ.250 వంతున మాత్రమే. ఎన్నికలకు ముందు జనవరి నుంచి రూ.2750గా ఉన్న పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచారు.

మలిసగం: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి వెయ్యి రూపాయల పింఛను పెంచింది. రూ.4 వేలు చేసింది. పైగా ఏప్రిల్ నుంచి బకాయిలు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు జూలై 1న అందించారు. జిల్లాలో మొత్తం 2.68 లక్షల మంది పెన్షనర్లుండగా.. రూ.3 వేలు తీసుకుంటున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర కేటగిరీల వారు 2.10 లక్షల మంది ఉన్నారు. వైసీపీ పాలించిన తొలి ఆరు నెలలతో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వం నెలకు రూ.2.10 కోట్లను అదనంగా అందిస్తోంది.

పాడికి పెద్దపీట



తొలిసగం: తొలినుంచీ పాడిలో నెంబర్ ఒన్‌గా ఉండే జిల్లాను వైసీపీ నిర్లక్ష్యం చేసింది. అమూల్ కంపెనీకి కోట్ల ఆస్తులు కట్టబెట్టడం మీద పెట్టిన శ్రద్ధ పాడి ప్రోత్సాహకాలమీద పెట్టలేదు. **మలిసగం:** కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల నుంచి 90శాతం రాయితీతో జిల్లాకు 2131 గోకులం షెడ్లను మంజూరు చేసింది. దీనికోసం రూ.50 కోట్లను కేటాయించింది. 1824 షెడ్లు నిర్మాణ దశలో ఉండగా.. 153 పూర్తయ్యాయి.

ఉచిత సిలిండర్లు

తొలిసగం: వైసీపీ పాలనలో ఇటువంటి పథకం ఏదీ లేదు.

మలిసగం: ఉచిత సిలిండర్ల పథకాన్ని నవంబరు 1వ తేదీన గుడిపాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. జిల్లాలో 543,259 మంది తెల్లరేషన్ కార్డుదారులుండగా.. ఇప్పటివరకు 2 లక్షల మంది సిలిండర్లను బుక్ చేసుకున్నారు. వారికి 48 గంటల్లోనే రూ.16 కోట్ల సబ్సిడీని జమ చేసేశారు. ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా పొందవచ్చు. ప్రతి కుటుంబానికి రూ.837 చొప్పున మూడు సిలిండర్లకు రూ.2511 మేర లబ్ధి కలుగుతుంది. ఇలా జిల్లా పేద ప్రజలకు రూ.136.50 కోట్ల సబ్సిడీ అందుతుంది.



మళ్లీ 'డ్రిప్ ఇరిగేషన్'



తొలిసగం: వైసీపీ ప్రభుత్వం డ్రిప్ సేద్యాన్ని నిర్లక్ష్యం చేసింది. రైతులకు రాయితీలు ఇవ్వలేదు. ఆ పథకాన్నే పట్టించుకోలేదు.

మలిసగం: కూటమి ప్రభుత్వం డ్రిప్ పథకాన్ని పునరుద్ధరించింది. జిల్లాకు 21 వేల హెక్టార్లను లక్ష్యం ఇవ్వగా.. ఇప్పటివరకు 28097 హెక్టార్లకు రైతులు రిజిస్ట్రేషను చేసుకున్నారు. 11579 హెక్టార్లలో విచారణ పూర్తి చేసి, 3288 హెక్టార్లకు రాయితీలు మంజూరు చేశారు.

ఉద్యానపంటలు

తొలిసగం: ఉద్యానపంటల సాగులో జిల్లా మెరుగైన స్థానంలో ఉండేది. వీటి సాగుకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నింటినీ జగన్ ప్రభుత్వం గాలికొదిలేసింది.

మలిసగం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యానపంటలు సాగుచేసే రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రోత్సాహకాల కోసం జిల్లాకు రూ.19.64 కోట్లను మంజూరు చేసింది. ఉద్యాన పంటల పరిశోధనల కోసం శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో 50 ఎకరాల్ని కేటాయిస్తూ తాజాగా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.



సర్వే రాళ్ల చాదస్తానికి రూ.5 కోట్లు



తొలిసగం: రైతుల సొంత పొలాల్లోని సర్వే రాళ్ల మీద కూడా జగన్ బొమ్మలు వేసి ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేశారు. జిల్లాలో 329 రెవెన్యూ గ్రామాల్లోని 3,02,555 ఎకరాల్లో వైసీపీ ప్రభుత్వం రీసర్వే పూర్తి చేసింది. 3,33,066 సర్వే రాళ్లను నాటారు. రూ.4.64 కోట్లను ఖర్చు చేశారు.

మలిసగం: ఇప్పుడు ఆ రాళ్ల మీద జగన్ బొమ్మలు, పేర్లను కూటమి ప్రభుత్వం తొలగిస్తోంది. ఇప్పటికే 12,659 రాళ్లపై ఫొటోలు తొలగించారు. ఒక్కో రాయి మీద ఉన్న జగన్ ఫొటో, పేరును తొలగించడానికి రూ.15 కేటాయించారు. ఈ లెక్కన 3,33,066 రాళ్ల మీద తొలగించడానికి రూ.50 లక్షలు ఖర్చు అవుతోంది.

పాసుపుస్తకాలపై ఫొటోలకు రూ.3.60 కోట్లు



తొలిసగం: చివరికి రైతుల పాసుపుస్తకాల మీద కూడా జగన్ ఫొటో ముద్రించి వైసీపీ ప్రభుత్వం నవ్వులపాలైంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో 90,287 మంది రైతులకు పాసుపుస్తకాలను అందించారు. పుస్తకం మొదటి, చివరి పేజీలతో పాటు లోపలి పేజీల్లోనూ జగన్ ఫొటోలుండడంతో ఒక్కో పుస్తకానికి ప్రింటింగ్ ఖర్చు రూ.200 చొప్పున అయింది. అంటే జగన్ ఫొటోలతో పంపిణీకి 1.80 కోట్లు ఖర్చు చేశారు.

మలిసగం: కూటమి ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుని, గౌరవప్రదంగా రాజముద్రతో పంపిణీ చేయనుంది. కాకపోతే ఇందుకు మరో రూ.1.80 కోట్లు ఖర్చు చేయక తప్పడం లేదు.

కృషి విజ్ఞాన కేంద్రానికి 50.21 ఎకరాల కేటాయింపు



తమ్మిగానిపల్లె వద్ద కేటాయించిన స్థలం

కుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయే కృషి విజ్ఞాన కేంద్రంకోసం 50.21 ఎకాలను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె సమీపంలో ఇందుకోసం స్థలాన్ని కేటాయించారు. ఎల్‌పీఎం 436లో 2.74 ఎకరాలు, 437లో 6.37, 645లో 10.01, 439లో 9.03, 440లో 5.35, 461లో 5.94, 462లో 4.63, 463లో 6.14 ఎకరాల చొప్పున మొత్తం 50.21 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ.సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థలంలో ఆచార్య ఎన్జీ.రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై ఈ కేంద్రంలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలను అమలు చేసి, నూతన వంగడాల ఉత్పత్తికి అవసరమైన సదుపాయాలు కల్పించనున్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిరంతరం రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు.

మున్సిపల్ టీచర్లకు ముగిసిన పదోన్నతి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలోని టీచర్లకు సీనియారిటీ ఆధారంగా చేపట్టిన పదోన్నతి కౌన్సెలింగ్ మంగళవారంతో ప్రశాంతంగా ముగిసింది. డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో అర్హత కలిగిన టీచర్లకు పదోన్నతి కల్పించారు. ఆదివారం ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం పదోన్నతి ప్రక్రియ ముగియగా, సోమవారం ఎస్టీటీ నుంచి ఎస్‌ఏలకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. కాగా సంబంధిత సెక్షన్ అధికారుల సమన్వయలోపంతో సీనియారిటీ జాబితా తయారీ పలుమార్లు సవరణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నిర్వహించాల్సిన పదోన్నతి కౌన్సెలింగ్ పక్రియను మంగళవారం మధ్యాహ్ననికి వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.డీఈవో వరలక్ష్మి జోక్యంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి 6 గంటల వరకు సీనియారిటీపై కసరత్తు చేసి, ఆపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్టీటీలకు ఎస్‌ఏలుగా 36 పోస్టులకు గాను హిందీ, తెలుగు మినహా 27పోస్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో మున్సిపాలిటీ ఫిజిక్స్, మ్యాథ్స్, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఇంగ్లీషు నాలుగు, బయాలజీ 8 (తెలుగు), సోషియల్ (తెలుగు)10, మ్యాథ్స్ (తెలుగు), ఫిజిక్స్ (తెలుగు), సోషియల్ (తమిళం), పీడీ (తెలుగు) ఒక్కో పోస్టు ఉన్నాయి. ఇదిలా ఉండగా కౌన్సెలింగ్ నిలిపి వేసిన హిందీ, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రావాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏడీలు రంగస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డిపోల నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక రీచులు లేనందున ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో ఇసుక డిపోలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, నగరి, పలమనేరు ప్రాంతాల్లో ఈ ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సొంత రవాణా వాహనాలు, సొంత భూమి లేదా లీజు భూమి ఒప్పంద పత్రాలు కలిగిన వారు జనవరి 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు చిత్తూరు నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వున్న జిల్లా గనుల, భూగర్భశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 70738 86327 నెంబరులో సంప్రదించాలన్నారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

పెనుమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధంతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన సచివాలయ ఉద్యోగి చివరకు సస్పెండయ్యారు. పెనుమూరు మండలం గుంటిపల్లి సచివాలయ ఉద్యోగి తన భార్యను ట్రాప్ చేయడం తట్టుకోలేక చనిపోతున్నానంటూ గుడ్యాణంపల్లికి చెందిన మోహన్ ఆచారి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ మంగళవారం ఉదయం ఆ సచివాలయ ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు చెప్పారని ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి తెలిపారు.



కోట మండలం గోవిందపల్లిపాలెం వద్ద సముద్రంలో అలల ఉధృతి

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- మరో రెండు రోజుల పాటు వర్ష సూచన
- తీరం వెంబడి చలి గాలుల తీవ్రత అధికం

సూళ్లూరుపేట/కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాకు భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. మంగళవారం తెల్లవారుజామున సూళ్లూరుపేటలో చలి గాలులతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇది బలపడితే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ప్రస్తుతం తీరానికి సమీపంలో కదులుతున్న క్రమంలో మేఘాలు కమ్ముకుని, చలిగాలులు వీస్తున్నాయి. సముద్రంలో గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండటంతో అల్లకల్లోలంగా ఉంటుందని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. కాగా, కోట మండలం గోవిందపల్లిపాలెం, శ్రీనివాససత్రం గ్రామాల సమీపంలో మంగళవారం సముద్రం కల్లోలభరితంగా మారింది. దీంతో మత్స్యకారులు చేపలవేట నిలిపివేశారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారాయ్!

దొరవారిసత్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వేదికగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారినట్లు తెలిసింది. తొలుత జనవరి 10 నుంచి మూడు రోజుల పాటు జరగాల్సి ఉండేది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రావడం, శ్రీవారి దర్శనానికి వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ)ను సంక్రాంతి తర్వాత నిర్వహించాలని యంత్రాంగం భావించింది. ఆ ప్రకారం జనవరి 17 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించడానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయం తీసుకున్నారు. గత షెడ్యూల్‌లో ఏవిధంగా కార్యక్రమాలు, వేదికలు ఉన్నాయో అదే విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించడానికి కలెక్టర్ నేతృత్వంలో కమిటీ సంసిద్ధమైంది.

పోలవరం సదస్సుకు స్పందన కరువు

- హాజరుకాని అధికారులు

పూతలపట్టు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులకు రైతులు అంతంత మాత్రంగానే హాజరవుతున్నారు. దీనికి తోడు అధికారులు కూడా అందరూ హాజరవడం లేదు. పోలవరం సచివాలయంలో మంగళవారం తహసీల్దార్ గుర్రప్ప అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.రైతులు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఈ సదస్సు జరుగుతుందనే విషయం రైతులకు తెలియకపోవడం వల్లే ఇలా జరిగిందని సమాచారం.



పోలవరం సదస్సులో ఖాళీగా కుర్చీలు

రెవిన్యూ సదస్సులు 50 శాతం పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభమైన రెవిన్యూ సదస్సులు 50 శాతానికి పైగా రెవిన్యూ గ్రామాల్లో పూర్తయ్యాయి. జిల్లాలో 822 రెవిన్యూ గ్రామాలుండగా, మంగళవారం నాటికి 481 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. మంగళవారం 44 గ్రామాల్లో జరగ్గా, 1129 మంది గ్రామస్థులు పాల్గొని భూసమస్యలపై 152 అర్జీలు అధికారులకు అందజేశారు. దీంతో ఇంతవరకు అందిన అర్జీల సంఖ్య 7470కి చేరింది.



మంచుకొండలు కాదు.. మనూరే!

ప్రకృతి బహు విచిత్రమైనది. ఒక్కోసారి కశ్మీరం అవతలుండే కాంచన జంగనూ, విశాఖ అవలవుండే లంబసింగ్ లోయనూ కూడా మన కళ్ల ముందుకు తెస్తుంది. మబ్బులు కమ్మిన మంగళవారం సాయంత్రం తిరుపతి ఫ్లై ఓవర్ మీదుగా తిరుచానూరు వైపు ప్రయాణిస్తున్న వారికి కనువిందు చేసిన దృశ్యం ఇది. తెల్లమబ్బుల ముట్టడిలో అప్పలాయగుంట నల్లకొండలు ఇలా కనిపించాయి.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.15 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,656

తలనీలాలు సమర్పించినవారు : 24,360





సేవా పరిమళం @ 160 ఏళ్లు



ఆగస్టమీలియస్ విగ్రహం

నాయుడుపేటలో 160 ఏళ్ల చరిత్రను సొంతం చేసుకున్న లూథరన్ చర్చి సేవకు చిరునామాగా నిలుస్తోంది. సేవలను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో ఆగస్టమీలియస్ ఆధ్వర్యంలో 1865లో నాయుడుపేటలోని 15 ఎకరాల్లో ఈ చర్చి మొదలైంది. ఈ ప్రార్థనాలయం నేటికీ చెక్కుచెదరని చారిత్రాత్మక కట్టడాలకు తార్కాణంగా నిలుస్తుంది. నాడు బాగా వెనుకబడిన ఈ ప్రాంతంలో చర్చి ఆధ్వర్యంలో పలు విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వైద్య సేవలను దగ్గరకు చేర్చి బాధితులకు అక్కున చేర్చుకుంది. కుటుంబ ఆదరణ కోల్పోయిన, వితంతు, వృద్ధులను ఆగస్టమీలియస్ స్త్రీబా హోమ్ ఏర్పాటు చేసి అండగా నిలిచారు. జర్మనీ నుంచి మీలియస్ మనదేశంలో అడుగుపెట్టాక ఇక్కడి స్థితిగతులకు చలించిపోయారు. సేవకు అంకితం కావాలని సంకల్పించారు. ఇందులో భాగంగా చెన్నై, సూళ్లూరుపేట, నాయుడుపేట, రాజమండ్రి, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, రాపూరు, కోడూరు, వాకాడు తదితర ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేశారు. సేవామూర్తిగా పదుగురి గుండెల్లో నిలిచిపోయారు. 1887 మే 21న ఈ కరుణామయుడు నాయుడుపేట చర్చిలోనే తుదిశ్వాస విడిచారు. దీంతో మీలియస్ సమాధిని చర్చిలోనే ఏర్పాటు చేశారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

విద్యాకాంతులకు ప్రతీక





ఎస్‌ఏఎల్‌సీ చర్చి - క్రిస్మస్ సందర్భంగా ముస్తాబువుతున్న చర్చిలోని ప్రాంగణం

జర్మనీకి చెందిన డాక్టర్ మీలియస్ చొరవతో 1867లో గూడూరులో సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ (ఎస్‌ఏఎల్‌సీ) చర్చి ఏర్పాటైంది. ప్రార్థనలకే పరిమితం కాకుండా ఈ చర్చి సేవాపరిమళాలను వెదజల్లింది. ఇంగ్లీషు మీడియం పాఠశాల, వసతి గృహాన్ని నిర్వహించి అట్టడుడు వర్గాల్లో విద్యజ్యోతులను వెలిగించింది. ఎస్‌ఎంజీ పాఠశాల ఎందరో విద్యార్థులకు బతుకుదారి చూపించింది. అప్పటిలోనే ఇంగ్లీష్ మీడియంలో ఇక్కడ బోధించేవారు. గూడూరుతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి ప్రాంతాల నుంచీ వేల సంఖ్యలో ప్రజలు ఈ చర్చికి వచ్చేవారు. 157 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మతాలకు అతీతంగా ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి



పుత్తూరులో 117 ఏళ్ల చర్చి

పుత్తూరులో బ్రిటిష్ కాలంలో కోన్‌లాగా నిర్మించిన ఈ ఎత్తయిన చర్చి... పట్టణానికి మరో వారసత్వపు ఆభరణం. దక్షిణ భారత సెయింట్ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో 1907లో ఈ చర్చిని నిర్మించారు. 2007లో వందేళ్ల ఉత్సవాలను నిర్వహించారు. కిలోమీటరు నుంచి చూసినా కనిపించే ఈ భవనాన్ని క్రైస్తవులు భద్రంగా కాపాడుకుంటున్నారు. దాదాపు వంద మంది కూర్చుని ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ భవనం వుంది.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

యూటీఎఫ్ అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్ - ముత్యాలరెడ్డి - మధుసూదన్‌రెడ్డి

తిరుపతిరూరల్ (గాంధీరోడ్డు), డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జీజే రాజశేఖర్, ప్రధానకార్యదర్శిగా కె.ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారిగా కె.మోహన్‌బాబు, కార్యదర్శిగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎస్.శేఖర్, ప్రభాకర్, సుధీర్, మస్తానయ్య, హరిబాబు, సురేష్, పద్మజ, విజయ్‌కుమార్, వెంకటకృష్ణ, ఆదినారాయణ, విజయశ్రీ, గోవర్ధన్‌రెడ్డి, హేమాంబరధరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా నిర్మల, ముత్యాలరెడ్డి, రాజశేఖర్, వాసుదేవరావు, సదాశివరెడ్డి, సునీల, రమేష్ నాయుడు, నాగరాజు, కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా మోహన్, శివకుమార్, నాగేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, దీపిక, రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ముక్కంటి సేవలో జపనీయులు



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం 8 మంది జపాన్ దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ లోగోతో తిరుమలకు కారు



తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన లోగోతో ఓ కారు తిరుమలకు వచ్చింది. సాధారణంగా రాజకీయ గుర్తులు, జెండాలు, వ్యక్తుల ఫొటోలు, చిహ్నాలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లో భద్రతా సిబ్బంది గుర్తించి అడ్డుకోవాలి. అయినా, మంగళవారం పద్మావతి ఏరియాలో ఓ వాహనంపై టీడీపీ లోగో ఉండటం చర్చనీయాశంగా మారింది. అలిపిరి వద్ద తనిఖీల లోపం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలున్నాయి.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ రోజున ఉదయం 7గంటలకు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో హాజరుకావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13వరకు జైపూర్‌లో జరిగే సీనియర్ పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

సైబర్ ఉచ్చులో శ్రీసిటి ఉద్యోగి

- ఖాతాలో రూ.లక్ష మాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి శ్రీసిటి ఉద్యోగి ఆర్ఎస్ రెడ్డి తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష పోగొట్టుకున్నారు. సూళ్లూరుపేటలో జరిగిన ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఈయన మొబైల్‌కు రెండు రోజుల కిందట ఓ యాప్ వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకొంటే సులభంగా నగదు సంపాదించవచ్చనే మెసేజీ యాప్‌లో వచ్చింది. ఆ యాప్‌ను ఓపెన్ చేయడంతో నాలుగు విడతలుగా ఈయన ఖాతాలో ఉన్న రూ.లక్ష వరకు డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీములవారిపాళెంలో బోటు షికారు

- జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచడానికి భీములవారిపాళెం రేవులో బోటు షికారు ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన భీములవారిపాళెం పడవల రేవును ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబుతో కలిసి పరిశీలించారు. బోటు షికారు ఏర్పాట్లపై ఆరా తీశారు. రేవు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. బోటు షికారుకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఆస్కారం ఉన్నందున 30 పడవల వరకు ఏర్పాటు చేయాలని మత్స్యకార నాయకులకు ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ కొండపనాయుడు, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సుధాకర్, జయపాల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఆరుగురికి పదేళ్ల జైలు

- రూ.20 వేల జరిమానా

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఆరుగురు నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. సూళ్లూరుపేటకు చెందిన ఓ బాలికకు మోసపూరిత మాటలు చెప్పి లైంగికంగా వేధించిన ఆరుగురిపై 2014లో పోక్సో కేసు నమోదైంది. మంగళవారం నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ విచారణ పూర్తిచేసి నేరం రుజువు కావడంతో నిందితులు మల్లపు భానుప్రకాష్, మల్లపు వెంకటేశ్వర్లు, మల్లపు సుభాషిణి, అక్కరపాక స్వాతి, అక్కరపాక రమేష్, రేపూరి మాల కొండయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లా కోర్సుల్లో ప్రవేశానికి రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహిస్తున్న లా కోర్సుల్లో ప్రవేశానికి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ టీకా రమేష్‌బాబు తెలిపారు.

నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి

ప్రణాళికలు సిద్ధం చేయండి: ప్రద్యుమ్న



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో మంగళవారం ఆయన జిల్లాలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. అసెట్స్ సర్వే చేపట్టాలని, స్వయంశక్తి ప్లస్, వృత్తి నైపుణ్యం యువతకు అవసరమైన పరిశ్రమలు, ఉపాధి శిక్షణ స్కిల్ ప్రొఫైల్ సిద్ధం కావాలన్నారు. జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు, సముద్రతీరం, ఐఐటీ వంటి కేంద్ర విద్యాసంస్థలు, ఈఎంసీ, శ్రీసిటీ, షార్, గుడిమల్లం ఆలయం వంటి విశేషమైన డైవర్సిఫైడ్ సిస్టం ఉండటం విశేషమన్నారు. యూనిక్ ప్రొడక్ట్ మిషనరీ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలన్నారు. కనీసం రెండు అటానమస్ డ్రోన్లనయినా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోలీసు శాఖ అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చన్నారు. స్టాండ్అప్ ఇండియా, ఎంఎస్ఎంఈ తదితర పథకాల కింద బ్యాంకుల సహకారంతో కొత్తయూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ఊర్జా మిత్ర పథకాల గురించి చర్చించారు. గ్రామీణ రోడ్లకు మరమ్మతులు, సిమెంటు రోడ్ల ఆవశ్యకతపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచీ ఫ్యామిలీ ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సుడిగాలి పర్యటన

రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరులేన్ల జాతీయ రహదారిని పరిశీలిస్తూ.. పనుల పరోగతిని ప్రద్యుమ్న ఆరాతీశారు. నాయుడుపేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పనులను పరిశీలించారు. ఇక నాలుగు శాతం పనులు మిగిలాయని రోడ్డునిర్మాణ సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

నారావారిపల్లెలో ఇలా..

నారావారపల్లెలో చేపట్టబోయే పనుల గురించి కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. పాఠశాలల్లో అధునాతన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులను శ్రీసిటీ ద్వారా రూ.80లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణ.. పాడి పశువులకు గోకులాలు.. 242 స్వయం సహాయక మహిళా సంఘాలకు డ్రోన్ నిర్వహణ, ఈ-ఆటో కింద కొందరికి రుణ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, డీపీవో సుశీలదేవి, అధికారులు పాల్గొన్నారు.

● తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో..

వేగం తెచ్చిన అనర్థం

- వృద్ధురాలి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- పరమేశ్వర మంగళం వద్ద ఘటన
- సురక్షితంగా బయట పడ్డ చిన్నారి



గాయపడిన వైష్ణినేతిలి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని చెన్నై కీలంబాకంకు బయలుదేరిన నెం.టీఎన్ 66 క్యూ 9263 కారు ప్రమాదానికి గురైంది. పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద ఉదయం 11.15 గంటలకు ప్రమాదం జరిగింది. ఇదే గ్రామం హరిజనవాడకు చెందిన ఐలయ్య భార్య శాంతకుమారి(60) రోడ్డు దాటుతుండగా కారు ఆమెను వేగంగా ఢీ కొంది. ఈ క్రమంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న బండరాయిని ఢీకొట్టింది. కారు నుజ్జు నుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు తల్లి సీతాలక్ష్మీ, తండ్రి పళనిస్వామి, కుమారుడు నవనీత కృష్ణ, కోడలు వైష్ణినేతిలికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారును నవనీత కృష్ణ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శాంతకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు హాజరైన వారిపై దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- ఒకరి మృతి
- పాక్షికంగా దెబ్బతిన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో



కారు దూసుకెళ్లడంతో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు



మృతి చెందిన కొండారెడ్డి

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు హాజరైన వారిపై కారు దూసుకెళ్లిన ఘనటలో వృద్ధుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్(35) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటేష్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామం వద్ద నిర్వహిస్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గిపేరికి చెందిన కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు కృష్ణంపల్లికి చెందిన గెరటారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో దెబ్బతిన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆటోలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండారెడ్డి(75) మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కొండారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పరకామణి దొంగతనంపై 'ఎంక్వైరీ కమిషన్' వేయండి

- టీటీడీ చైర్మన్‌కు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న భానుప్రకాష్

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ లెక్కింపుల పరకామణిలో దొంగతనం కేసుపై 'ఎంక్వైరీ కమిషన్' వేయాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో పరకామణిలో పనిచేసిన రవికుమార్ దొంగతనం చేయగా కేసు పెట్టారని, పోలీసుల ఒత్తిడితో లోక్‌అదాలత్‌లో రాజీపడ్డామని అప్పుడు పనిచేసిన విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చారని, దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. తిరుపతి, చెన్నైలోని రవికుమార్ ఆస్తులను టీటీడీకి బదిలీ చేశారన్నారు. ఈ పంచాయితీ ఏంటని ఆయన ప్రశ్నించారు. రాజీకి పొమ్మని చెప్పిన పోలీసు అధికారులు ఎవరో తెలియాలన్నారు. దీనిపై కమిషన్ వేసేంతవరకు బోర్డు సభ్యుడిగా పోరాడతానని చెప్పారు.

'పద్మావతి' సముదాయం లీజు రద్దుపైనా..

తిరుచానూరులోని టీటీడీకి చెందిన పద్మావతి యాత్రికుల వసతి సముదాయం కలెక్టరేట్‌కు ఇచ్చారని, దాని లీజు రద్దుపై పోరాటం కొనసాగిస్తానని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కలెక్టరేట్‌కు కేటాయించడంపై తాను హైకోర్టుకు వెళ్లానన్నారు. గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి ట్రాన్సిట్ అకామిడేషన్ త్వరలోనే తెలియజేస్తామని, అప్పటివరకు టీటీడీకి నెలకు రూ.21.50 లక్షల అద్దెను జీఎస్టీసహా చెల్లిస్తామని తెలిపిందన్నారు. తాజాగా లీజును మరో మూడేళ్లకు పెంచడంతో పాటు క్లీనింగ్ కోసం రూ.7 లక్షలు కూడా టీటీడీనే ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖ వచ్చిందన్నారు. ఈ క్లీనింగ్ నిధులను ఆపడంతో పాటులీజు రద్దు చేయాలని చైర్మన్‌ను కోరానన్నారు.

రూ.20 లక్షల ఎర్రచందనం దుంగల స్వాధీనం

- ముగ్గురు ప్రధాన స్మగ్లర్ల అరెస్ట్

మంగళం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రెప్పాల తిప్ప సమీప అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. రూ.20లక్షల విలువైన 69 ఎర్రచందనం దుంగలతో పాటుగా ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను, ఐదుగురు కూలీలను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి, ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు.. టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారంతో సోమవారం రాత్రి రెప్పాల తిప్ప అటవీ ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేశారు. అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన 69 ఎర్రచందనం దుంగలను, కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజ్ తొరైస్వామి అనే ముగ్గురు స్మగ్లర్లను, తమిళనాడుకు చెందిన ఐదుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు చేస్తున్నారు. కేసు చేదనలో ప్రతిభ చూపిన ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఐ చిరంజీవి, ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ నరేష్, సిబ్బందిని ఇన్చార్జి సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు






క్రిస్మస్ పండుగ సందర్భంగా విశేషాలంకరణలో పుంగనూరు సీఎస్‌ఐ చర్చి - లోపల ఆకట్టుకుంటున్న గొర్రెలపాక - చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని బీటీకాంపౌండ్ చర్చికి విశేషాలంకరణ - చిత్తూరులోని క్యాథలిక్ చర్చిలో క్రీస్తు జనన ఘట్టాల నమూనా

క్రైస్తవానికి బీజం మార్లపల్లె



మార్లపల్లెలో వెంకటమ్మ నిర్మించిన చర్చి

పుంగనూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 323 ఏళ్ల క్రితమే తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత వ్యాప్తికి తొలిసారిగా పుంగనూరు సమీపంలోని మార్లపల్లెలోనే బీజం పడింది. పుంగనూరు బజారువీధిలో 1701లో క్రైస్తవ మత బోధనలు విన్న మార్లపల్లెకు చెందిన వెంకటమ్మ తన నలుగురు కుమారులతో తొలిసారిగా బాప్టిజాన్ని స్వీకరించడం, ఇక్కడి నుంచే మత వ్యాప్తి పురుడుపోసుకోవడంతో మార్లపల్లెకు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించింది. అప్పట్లోనే వెంకటమ్మ తన పేరును నవరమ్మగా మార్చుకుంది. పుదుచ్చేరి నుంచి కర్ణాటక మీదుగా క్రైస్తవ బోధనలు చేస్తూ మత ప్రచారకులు పుంగనూరుకు రావడంతో వెంకటమ్మ ఆకర్షితురాలయ్యారు.మార్లపల్లెలో ఒక చిన్న ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో 1935లో పక్కనే మేరీమాత చర్చిని నిర్మించగా అది కూడా శిథిలావస్థకు చేరింది.ఆ చర్చిని మూడేళ్ల క్రితం వేలాంగని తరహాలో రాళ్లతో నిర్మించి మేరీ మాత బొమ్మను అమర్చారు. మార్లపల్లె సమీపంలోని పొలాల్లో వెంకటమ్మ, ఆమె కుమారుల సమాధులున్నాయి.ఈ గ్రామంలో 1780లోనే రోమన్ క్యాథలిక్ చర్చి నిర్మించినట్లు ప్రముఖ చరిత్రకారుడు టీఎస్ శేషన్ తన రచనల్లో పేర్కొన్నారు. అలాగే 1976లో విశ్రాంత ఉపాధ్యాయుడు చిన్నప్ప రాసిన సువార్త ప్రబోధ, భారతమిత్రం, 1884లో చెన్నైలో ప్రచురితమైన పుంగనూరు సంస్థాన చరిత్రలో కూడా మార్లపల్లె గురించి ప్రస్తావన వుంది. జమీందారుల ఏలుబడిలో ప్రధాన పరిపాలనా కేంద్రంగా బాసిల్లిన పుంగనూరు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.క్రైస్తవులు ప్రార్థనలు చేసుకునేందుకు పుంగనూరు నడిబొడ్డున 1887లోనే సీఎస్‌ఐ చర్చి నిర్మించారు.1889లో బసవరాజ పాఠశాలలో ఉన్నత విద్యాబోధన ప్రారంభమైంది. అంతకు మునుపే అంటే 1860లోనే మిషనరీస్ సర్వీసులు ప్రారంభమయ్యాయి.ప్రస్తుత ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో క్రిస్టియన్ హాస్పిటల్ ఏర్పాటు, తర్వాత మార్లపల్లె సమీపంలో డాన్‌బోస్కో స్కూల్ ప్రారంభించారు.



మార్లపల్లె పొలాల్లో వెంకటమ్మ సమాధి



మార్లపల్లె చర్చిలో గుహ తరహాలో ఏర్పాటైన వేలాంగినీ మేరీమాత



మార్లపల్లెలోని మేరీమాత చర్చి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి
రూ.4.71 కోట్ల చిత్తూరు ఎంపీ నిధులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.4.71 కోట్ల ఎంపీ నిధులు కేటాయించినట్లు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని గ్రామాలకు మంజూరైన 85 రకాల వివిధ అభివృద్ధి పనులకుగాను ఇప్పటికే రూ.4.71 కోట్ల ఎంపీ నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజి కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం, రహదారుల అనుసంధానం కోసం ఈ నిధులు వెచ్చించారని తెలిపారు. మామిడి పంటను రైతులకు లాభసాటిగా మార్చేందుకు చిత్తూరులో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖరాశామని తెలిపారు. పాకాలలో రైల్వే కోచ్ ఏర్పాటు చేయనున్నామని, దీంతో జిల్లా రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చిత్త శుద్ధితో పనిచేస్తున్నామని ఎంపీ ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



మహేంద్ర మృతదేహం

శాంతిపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.....గుండిశెట్టిపల్లెకు చెందిన మహేంద్ర శాంతిపురం జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి సబ్‌స్టేషను వద్దకు వెళ్లాడు. అక్కడ గేట్ వద్ద చెట్టులోని చీనీ కాయలను కోసే ప్రయత్నంలో చెట్టుపై ఉన్న హైఓల్టేజీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

నాటుబాంబు పేలి గోమాతకు గాయాలు



తీవ్రంగా గాయపడ్డ ఆవు

రామకుప్పం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం అటవీ ప్రాంతంలో వేటగాళ్ళు అమర్చిన నాటుబాంబు పేలి ఓ మూగజీవం గాయపడింది. స్థానికుల కథనం మేరకు .....మంగళవారం మధ్యాహ్నం కుప్పిగానిపల్లెకు చెందిన సురిటప్పకు చెందిన ఆవు మేత కోసం అటవీ సరిహద్దు ప్రాంతానికి వెళ్ళింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు చూడగా ఆవుకు నోటి వద్ద తీవ్రగాయమైంది.వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన నాటు బాంబును పొరబాటున నమలడం వల్ల అది పేలి తీవ్రగాయమైందని అంచనాకు వచ్చారు. మూడు రోజుల క్రితం చింతమానత్తంకు చెందిన ఓ వ్యక్తికి చెందిన పెంపుడుకుక్క ఇదేవిధంగా నాటుబాంబును నోట కరిచి, మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు.

వినియోగదారులు హక్కులను కాపాడుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్నేహలత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26: వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవలసిన అవసరం ఉందని వినియోగదారుల కమిషన్ అధ్య క్షురాలు స్నేహలత పేర్కొన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వినియోగదారులు నాణ్యత, సేవ లోపాలపై కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్, డిజిటల్ వ్యాపారాలు, అసత్య ప్రకటనలు, కల్తీ పదార్థాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి మద్దిలేటి మాట్లాడుతూ వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, నాణ్యత, రుచి, వాసన, ధర గమనించాలని ఇందులో తేడా ఉంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ అధికారి స్వామి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, కామర్స్ హెడ్ మల్లికార్జునరావు, డీటీలు జయరాజ్, సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పుర స్కరించుకుని మంగళవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలం కరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కొడుకు పెట్టే బాధలు భరించలేకే హత్య

కుమారుడి హత్య కేసులో తండ్రి సహా ముగ్గురి అరెస్ట్



హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కుమారుడి వేధింపులు భరించలేక కన్నతండ్రే బిడ్డను సుపారీ ఇచ్చి హతమార్చిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువమామిడిగుంపులపల్లెకు చెందిన గంగులరెడ్డి కుమారుడు సోమశేఖరరెడ్డి(36) చిన్నతనం నుంచి చెడు అలవాట్లకు బానిసై తరచూ గొడవలు పడేవాడు. పదేళ్ల క్రితం వివాహం చేయగా సోమశేఖర్‌రెడ్డి పెట్టిన చిత్రహింసలు భరించలేక భార్య, ఐదేళ్ల కుమారుడు బావిలో దూకి చనిపోయారు. దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులు సోమశేఖరరెడ్డితో పాటుఅతడి తండ్రి గంగులరెడ్డిపై కేసు నమోదు చేసిజైలుకు పంపారు.జైలునుంచీ వచ్చాక కూడా సోమశేఖరరెడ్డి మద్యానికి బానిసగా మారి గ్రామంలో అందరితో ఘర్షణపడేవాడు. తనకు రెండో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను తరచూ దుర్భాషలాడుతూ కొట్టేవాడు. ఈ బాధలు భరించలేక గంగులరెడ్డి తన కుమారుడు సోమశేఖరరెడ్డిని చంపేస్తే పీడా విరగడవుతుందని నిర్ణయించుకున్నాడు.పుంగనూరుమండలం చంద్రమాకులపల్లె పంచాయతీ గానుగులగడ్డకు చెందిన ఆటోడ్రైవర్ ఎం. అమరనాథ్(32), ఎం.రమేష్(26)తోపాటు ఫణేంద్రనాయక్‌తో మాట్లాడి రూ.35వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమశేఖరరెడ్డిని అమరనాథ్‌కు చెందిన ఆటోలో బోయకొండ అటవీప్రాంతానికి తీసుకెళ్లి రాళ్ళతో కొట్టి హత్య చేసి గుంటలో పడవేసి మృతదేహం కనిపించకుండా బోదగడ్డితో కప్పారు.ఈనెల20తేదీ బోయకొండ అటవీ ప్రాంతంలో ఓ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఎముకల గూడుగా కన్పించినట్లు పోలీసులకు చంద్రమాకులపల్లె వీఆర్వో శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. పుంగనూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సోమశేఖరరెడ్డి శవంగా గుర్తించారు.దీనిపై దర్యాప్తు చేసి సోమవారం రాత్రి హతుడి తండ్రి గంగులరెడ్డి(62), ఆటో డ్రైవర్ అమరనాథ్(32), ఎం, రమేశ్(26)లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలను ఎందుకు పూర్తిచేయలేదు?

● ప్రైవేటు బ్యాంకు కంట్రోలింగ్ అధికారులపై కలెక్టర్ అసహనం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుకలెక్టరేట్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కోసం అమలుచేసే పథకాల లక్ష్యాలను ప్రైవేటు బ్యాంకర్లు ఎందుకు పూర్తిచేయడం లేదంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం, లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడిగా అవసరమైన పంట రుణాలు, స్వల్పకాలిక రుణాలు వంటి రుణాల మంజూర్లలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులంటూ తారతమ్యం లేకుండా అన్ని బ్యాంకులు రుణమంజూర్లలో లక్ష్యాలను పూరిచేయాల్సిందేనని అన్నారు. ప్రైవేటు బ్యాంకులు లక్ష్యాలు పూర్తిచేయడంలో అనాసక్తి చూపడం తగదన్నారు. మిగిలిన వంద రోజుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రైవేటు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాల్సిందేనని ఖరాఖండీగా చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులందరికీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. ఎల్డీఎం హరీష్ మాట్లాడుతూ 2024-25 వార్షిక రుణప్రణాళికలో భాగంగా సెప్టెంబరు ఆఖరి నాటికి రూ.6699 కోట్ల రుణ పంపిణీ లక్ష్యం కాగా, లక్ష్యానికి మించి రూ.7654 పంపిణీ జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.5488 కోట్ల లక్ష్యానికి మించి రూ.6284 కోట్లు వితరణ చేశామన్నారు. ఎంఎస్ఎంఈలకు రూ.915కోట్లకు గాను రూ.1105 కోట్లు అందజేశామని వివరించారు. బ్యాంకు లింకేజీ ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.472 కోట్లు, మెప్మా ద్వారా రూ.214 కోట్లు అందజేశామని చెప్పారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం సునీల్, డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

మిట్టూరులో భూతగాదా



మిట్టూరులో రెవిన్యూ అధికారుల సర్వే

వి.కోట, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నెర్నపల్లె పంచాయతీ మిట్టూరులో ఇరు వర్గాల మధ్య నెలకొన్న భూవివాదం సర్వేతో వాగ్వాదానికి దారితీసింది. మిట్టూరుకు చెందిన వెంకట్రామప్ప, నారాయణప్ప కుటుంబాల నడుమ ఏళ్ళుగా భూవివాదం ఉంది. అయితే నారాయణప్ప కుమార్తె సంయుక్త తమ కుటుంబీకులకు చెందిన సర్వే నంబరు 203లో భూమిని వెంకట్రామప్ప కుటుంబీకులు ఆక్రమించారంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశానుసారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ నేతృత్వంలో తహసిల్దార్ పార్వతి, పోలీసులు, రెవిన్యూ సిబ్బంది గ్రామానికి వెళ్ళి క్షేత్ర పరిశీలన చేపట్టారు. సర్వే నంబరు 203కు సంబంధించి సర్వే చేపట్టి, దానికి అనుసంధానంగా ఉన్న రోడ్డు, ఇతర స్థలం పూర్తిగా చెరువుగా తేల్చారు. అలాగే 203లో ఉంటున్న వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోగా, గ్రామానికి చెందిన చెరువును చాలా కుటుంబాలు ఆక్రమించాయని, చివరకు రోడ్డు సైతం చెరువులోకే వస్తుందని అధికారులు తేల్చారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.గ్రామంలో అందరూ గుమికూడారు. ఇరుపక్షాలనూ సర్దుకుపోవాలని సూచించారు.వెంకట్రామప్ప నాటిన రాతికూసాలను తొలగించి గేటును మరి కొంత లోపలకు వేసుకునేలా ఒప్పందం కుదిర్చారు. అందుకు ఇరు పక్షాలు అంగీకరించడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో కూసాలు తొలగించి, గేటును తీసేయడంతో వివాదం సద్దుమణిగింది.మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు రాంబాబు, లంబోదరం, నాగరాజు, శేఖర్, చలపతి,ఆర్ఐ మోహన్‌రెడ్డి, సర్వేయర్ సద్దాం, ఏఎస్ఐ మురళీరెడ్డి, వీఆర్వో వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుల అరెస్టు

వెదురుకుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కొండకిందపల్లిలో మద్యం అమ్ముతున్న బెల్టు షాపు నిర్వాహకులు వైనరసింహారెడ్డి, మల్లికార్జునలను రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.వారి వద్ద 37 మద్యం సీసాలు , 51 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేవీఎం అగ్రహారం, నచ్చుకూరు, కురివికుప్పం, బ్రాహ్మణపల్లె, చింతలగుంట, నల్లవెంగనపల్లె, పెరుమాళ్లపల్లె, మొరవ, ఆళ్లమడుగు, పాతగుంట, దేవళంపేట, యనమలమంద ప్రాంతాల్లో మద్యం అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది.

రెవెన్యూ సదస్సులో టీడీపీ, వైసీపీ బాహాబాహి



టీడీపీ, వైసీపీ వర్గాల వాగ్వాదం

నగరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని గుండ్రాజుకుప్పం పంచాయతీలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఓదశలో అధికారుల ముందు రికార్డులు పెట్టివున్న టేబుళ్లను సైతం నెట్టివేశారు. ఒక వర్గంపై మరొక వర్గం వారు ఆరోపణలు చేసుకుంటూ నువ్వు కబ్జా చేశావంటే నువ్వు చేశావంటూ తీవ్రస్థాయిలో బల్లలు గుద్ది వాదించుకున్నారు. 35 ఏళ్లలో కాపాడిన ఆస్తులను గత ఐదేళ్ల పాలనలో సర్పంచ్ బాలచంద్రారెడ్డి కబ్జా చేశారని, పట్టాలు లేకనే ఇంటి స్థలాలు ఇచ్చారని టీడీపీ వర్గీయులు లక్ష్మీపతిరాజు, ఉమాపతిరాజు విమర్శించారు. పంచాయతీలో క్వారీ సర్పంచ్ బాలచంద్రారెడ్డి ఆనాధీనంలో ఉందని ఆయనకు రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చారు. అదేవిధంగా చెంగారెడ్డి క్వారీ సమస్యపై కూడా హైకోర్టులో కేసు నడుస్తోంది. ఈక్వారీల విషయమై ఇరువర్గాలు విమర్శించుకున్నారు. ఈ సమావేశంలో 20 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ రవికుమార్ తెలిపారు.

ఆర్ఈఎఫ్ అధ్యక్షుడిగా కుమార్



గంగవరం, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్.ఈ.ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా గంగవరం మండలం జే.ఆర్.కొత్తపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు ఏ.ఆర్.కుమార్ ఎంపికయ్యారు.

యువతి ఆత్మహత్య

రేణిగుంట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పట్టణంలో ఓ యువతి ఉరి వేసుకుంది. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వీఎం వీధికి చెందిన సతీష్‌కుమార్ కుమార్తె అసిత(22) ఇటీవల లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చింది. విదేశాల్లో మరిన్ని ఉన్నత చదువులు చదవాలని తండ్రితో చెప్పింది. ఏమైందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కుటుంబీకుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఫటా ఫట్?

టెస్టింగ్ ల్యాబ్‌లను వినియోగించుకోండి

● కొత్తపేట యూహెచ్‌సీ వైద్యాధికారి దీప్‌కుమార్


డాక్టర్ దీప్‌కుమార్

కుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని టెస్టింగ్ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలని కుప్పం పట్టణం కొత్తపేటలోని పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.దీప్ కుమార్ ప్రజలను కోరారు. యూహెచ్‌సీలో మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

?యూహెచ్‌సీలో చేసే పరీక్షలు

! కొత్తపేటలోని యూహెచ్‌సీలో అధునాతనమైన ల్యాబ్ సౌకర్యం ఉంది. ఇందులో షుగర్, రక్త పరీక్షలు, గర్భ నిర్ధారణ పరీక్ష, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి 60 రకాలైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తాం. లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు కూడా చేస్తాం. ప్రజలు ప్రైవేటు క్లినిక్‌లను, ల్యాబ్‌లను ఆశ్రయించి అనవసరంగా డబ్బులు ఖర్చు చేసుకోవద్దు.

? మందులు ఉచితంగానే

! ఏదైనా వ్యాధి ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే యూహెచ్‌సీకి వస్తే రోగిని పరీక్షించి, అవసరమైతే రక్త, ఇతర పరీక్షలు ఇక్కడే చేయిస్తాం. మందులు కూడా ఉచితంగానే ఇస్తాం. ఒకవేళ చికిత్స యూహెచ్‌సీలో అందుబాటులో లేకపోతే, వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. యూహెచ్‌సీలో వైద్య సేవలు, పరీక్షలు అన్నీ పూర్తిగా ఉచితమే.

? ఇటీవల వర్షాలతో సీజనల్ వ్యాధులు

! ఈ కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపించకుండా ప్రస్తుతం ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. వార్డుల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? కొత్తపేట యూహెచ్‌సీ పరిధిలో

! అనిమిగానిపల్లె, చీలేపల్లె, డీకేపల్లె 1, 2, కుప్పం 1, 2 సచివాలయాలు కొత్తపేట యూహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. యూహెచ్‌సీ అందిస్తున్న అన్నిరకాల వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జాతీయ రహదారిపై మంగళవారం వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని కారణంగానే చాలామంది మృత్యువాత పడుతున్నారని.. ద్విచక్ర వాహనంలో వెళ్లే ఇద్దరికీ హెల్మెట్ ఉంటే ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉన్న నిరాశ్రయులు, అభాగ్యులకు హెల్పింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీస్, ప్యాలెస్ కాంపౌండ్, నాగపాళ్యం, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్‌యార్డు తదితర ప్రాంతాలోని నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ప్రకాశ్, రాజు, గురుప్రసాద్, శ్రీనివాసులు, సతీష్, కిరణ్, రామాంజులు, హనీఫ్, విహాసిని, జశ్విత పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలి


బస్టాండులో విద్యార్థుల మానవహారం

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి ర్యాలీ చేపట్టారు. బస్టాండులో మానహారంగా నిర్వహించి జీవో నెంబరు 77 రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్నా, మన్సూర్, ఫోజియా, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో కల్లూరు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థి అబ్దుల్ సలామత్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న జడ్జి సలీమ్

కల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో కల్లూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు కుష్నిహాజ్, అబ్దుల్ సలామత్‌లకు జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు, జడ్జి సలీమ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పాఠశాల వినియోగదారుల క్లబ్ సమన్వయ కర్త వెంకటశిద్దులును అభినందించారు.

ఈడిగపల్లెలో సీసీ రోడ్లను నిర్మించాలని వినతి


చల్లా రామచంద్రారెడ్డిని సత్కరించిన ఈడిగపల్లె టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఈడిగపల్లెలో సీసీ రోడ్లను నిర్మించాలని మంగళవారం గ్రామస్థులు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరారు. రొంపిచెర్లలో రూరల్ టీడీపీ నాయకులు ఆయన్ను సత్కరించారు.యాతాలవంకలో బోరు, పైపుల ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారం చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈడిగపల్లె టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవులు, గ్రామ కార్యదర్శి భూపతి, దేవేంద్ర, రెడ్డెప్ప, మోహన తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలు


సహకార బ్యాంకు కరపత్రాలను విడుదల చేస్తున్న బ్యాంకు అధికారులు

పుంగనూరు రూరల్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల నుంచి రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలు అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ రాధారాణి తెలిపారు. మంగళవార రైతులకు అందించే రుణాల కరపత్రాలను పంపిణీ చేశారు. సహకార బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బంగారు, హౌసింగ్‌పై మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం గంట, సాయంత్రం గంట డిపాజిట్లు సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి రెడ్డెప్ప, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, గంగిరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీకాంత్, శ్రీను, రవికుమార్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


నర్సింగ్ కళాశాల క్రిస్మస్ వేడుకల్లో నిర్వాహకులు, విద్యార్థులు

కుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నర్సింగ్ కళాశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన శాంతా కారోల్స్ (క్రిస్మస్ తాత) నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్, కుప్పం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విమల, ప్రిన్సిపాల్ సుధారాణి, నర్సింగ్ కళాశాల, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి


దివ్యాంగురాలి నుంచి ధ్రువపత్రాలు స్వీకరిస్తున్న కడ పీవో వికాస్‌మర్మత్

రామకుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకే ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలల్లో గుర్తించి సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తోందని కడ పీవో వికాస్‌మర్మత్ తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ సౌజన్యంతో కాన్పూర్ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ వారిచే మంగళవారం రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కుప్పం, రామకుప్పంలల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే కావాల్సిన ఉపకరణాలను గుర్తించారన్నారు. రామకుప్పంలో నిర్వహించిన శిబిరానికి 734 మంది హాజరు కాగా.. వారిలో 680 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు. వారికి 45 రోజుల్లో సహాయ పరికరాలు అందిస్తామన్నారు. అర్హులైన వారికి సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజులు, డీఆర్డీఏ ఏపీడీ రవి, రామకుప్పం, శాంతిపురం మండలాల తహసీల్దార్లు బాబు, శివయ్య, ఎంపీడీవోలు లక్ష్మీకాంత్, కుమార్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు ఆంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగుయువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ, రామకృష్ణప్ప, మనోహర్, గంట్లరెడ్డి, గజేంద్ర, సలాంసాబ్, భానుమూర్తి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, సుబ్రీ, వెంకటరమణ, నవీన్, ఆదిల్, మంజునాథ్, ఏఎల్ఐఎంసీవో వైద్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు


పలమనేరులో విద్యుత్ కాంతులతో సీఎస్ఐ చర్చి

పుంగనూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని చర్చిలు ముస్తాబయ్యాయి. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులచే పట్టణంలోని అన్ని చర్చిలు, పరిసర ప్రాంతాలు, రోడ్లు, మురుగుకాల్వలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లారు. క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు జననానికి సంబంధించి గొర్రైలపాక, బొమ్మలు, లైట్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, ఇళ్లు, చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేస్తూ క్రైస్తవుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

●పలమనేరు: పలమనేరు పట్టణంలోని పురాతన సీఎస్ఐ చర్చిని క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత 164 సంవత్సరాలుగా క్రైస్తవ సోదరులు ఈ చర్చిలో ప్రార్థనలు చేస్తున్నారు.

పీర్లమాన్యం భూముల పరిశీలన


పీర్ల మాన్యం భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు, మైనార్టీ నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పీర్లమాన్యం భూములను అంజుమన్ కమిటీ సభ్యులతో కలిసి తహసీల్దార్ రాము పరిశీలించారు. మంగళవారం పట్టణంలోని సర్వే నంబరు 43/1లో 3.51 ఎకరాల భూమికి పట్టణానికి చెందిన కొందరు తప్పుడు రికార్డులు సృష్టించారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన భూములను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి మార్పు చేయడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అంజుమాన్ కమిటీ సభ్యు లు, రాతి మసీదు, కుమ్మరవీధి మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మెరుగైన అవకాశాలు


రీసోర్స్‌పర్సన్లకు జ్ఞాపిక అందిస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవడంతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని మదర్ థెరీసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మదర్‌థెరీసా కళాశాల లో బీటెక్ విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈడీయు నెట్, ఐబీఎం కంపెనీ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐబియమ్ స్కిల్ బుల్డ్ అనే వెబ్‌సైట్‌తో ఆన్‌లైన్ కోర్సులపై ఇచ్చే శిక్షణను శ్రద్ధగా వినాలన్నారు. ముఖ్యంగా ఈ వెబ్‌సైట్‌లో సుమారు 10 వేల కోర్సులు అందుబాటులో ఉన్నాయని.. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సునీల్, రాజేంద్రరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, రీసోర్స్‌పర్సన్ అశ్విని కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మురళీ

పెద్దపంజాణి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంకర్రాయలపేట ఎంజేపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు, చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నవారికి చికిత్సలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం 104 సిబ్బందితో కలిసి అమ్మరాజుపల్లెలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బందితో పాటు 104 సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీప్లస్ గ్రేడ్ పెంపుతో.. శుభారాం డిగ్రీ కళాశాల సమస్యలు తీరేనా..!

- నాక్ కమిటీ నివేదికతో బీ స్థాయి నుంచి బీ ప్లస్‌కు పెంపు



పుంగనూరు ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాల

పుంగనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ శుభారాం డిగ్రీ కాలేజిని ఇటీవల పరిశీలించిన నాక్ కమిటీ సంతృప్తి చెంది గతంలో ఉన్న బీ స్థాయి నుంచి బీ ప్లస్‌కు పెంచడంతో సమస్యలు తీరనున్నాయి. డిగ్రీకాలేజిని 1985లో నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విద్యాశాఖామంత్రి ఇంద్రారెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే ఎన్.రామకృష్ణారెడ్డిలు స్థానిక కోనేరు ఎదురుగా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ గదుల్లో బీఏ, బీకాం కోర్సులతో ప్రారంభించారు. తర్వాత టీడీపీ హయాంలోనే రామసముద్రం రోడ్డులో 14.05 ఎకరాల స్థలసేకరణ చేసి స్వంత భవనాలు నిర్మించారు. కానీ పుంగనూరు కాలేజి పట్టణానికి దూరంగా ఉండటం, భవనాల కొరత, తగిన కోర్సులు లేక అప్పటి నుంచి నేటి వరకు పలు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం కాలేజీలో బీకాం, బీకాం కంప్యూటర్స్ బీఎస్సీ బీఎస్సీ ఎంఎస్‌సీఎస్, బీఏ కోర్సులుండగా 350 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈనెల 9, 10 తేదీల్లో నాక్ పీర్‌కమిటీ టీమ్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ మిట్టల్ (ఢిల్లీ), డాక్టర్ ఆసీమా సాహు (ఒడిసా), డాక్టర్ మహ్మద్‌అలీ పల్లిపరంబిల్ (కేరళ) పర్యటించి కాలేజి ఆవరణ, కాలేజి బోధన సంబంధిత అంశాలను, సదుపాయాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వైఆర్సీ, ఆర్ఆర్‌సీ, జేకేసీ తదితర సపోర్టింగ్ యూనిట్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజశేఖర్ కాలేజీకి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం, పూర్వ విద్యార్థులు, కాలేజీ అభివృద్ధి కమిటీతో సమావేశాన్ని నిర్వహించి జరిగిన అభివృద్ధి, సమస్యల గురించి కమిటీ తెలుసుకుంది. కాగా కాలేజి బీ గ్రేడ్‌లో ఉండగా ఈనెల 20వ తేదీన నాక్ కమిటీ బీప్లస్ గ్రేడ్‌కు పెంచుతున్నట్లు ప్రిన్సిపాల్‌కు లేఖ పంపారు. నాక్ కమిటీ కాలేజి స్థాయిని పెంచడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మౌలిక వసతులు, అదనపు కోర్సులు, హాస్టల్, ప్రహరీ నిర్మాణ పనులు జరిగి కాలేజీ సమస్యలు తీరగలవని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్మెట్.. ప్రాణాలను రక్షించే కవచం

● చిత్తూరు డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షించే కవచం హెల్మెట్ అని, ప్రతిఒక్కరూ ద్విచక్రవాహన ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అన్నారు. మంగళవారం సీతమ్స్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంతో ప్రాణ నష్టాలను పూర్తిగా తగ్గించవచ్చన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని, అప్పుడే ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో తల, మెదడును హెల్మెట్ కాపాడుతుందన్నారు. అనంతరం పోలీసులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఎంవీఐలు మురళీ, శివకుమార్, ప్రిన్సిపాల్ వెంకటాచలపతి పాల్గొన్నారు.

మోసపూరిత ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మోసపూరిత ప్రచారాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ సూచించారు. మంగళవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం కోసం 1986 డిసెంబరు 24న మొదటిసారిగా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ-కామర్స్, డిజిటల్ వర్తకంపై వినియోగదారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారని, ఆన్‌లైన్ కొనుగోలు సమయంలో గుర్తింపు పొందిన వెబ్‌సైట్ ద్వారా సురక్షిత కొనుగోలు చేయాలని, మోసపూరిత ప్రకటనలు నమ్మరాదని హెచ్చరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


మోటుమల్లెలలో మాట్లాడుతున్న తహసీల్దారు కిరణ్‌కుమార్

చౌడేపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డీటీ మాధవి అన్నారు. ఆదివారం మండలంలోని కాటిపేరి పంచాయతీలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భూసమస్యలపై 46 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, వీఆర్‌వోలు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: మోటుమల్లెల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు కిరణ్‌కుమార్ భూసమస్యలపై 28 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ లోకేష్, ఎండోమెంట్ అధికారి ద్వారకనాథ్, శిరీష, నరేష్ మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●వి.కోట: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. మంగళవారం వి.కోట సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటిపై సర్వే జరిపి తగు చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ బదులిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎన్.లక్ష్మీ, టీడీపీ నేతలు సుబ్బన్న, ధీరజ్, రాంబాబు, చౌడప్ప, రాము, ఎస్‌కే.ఇక్బాల్, ఆర్ఐ మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రజక బాలిక కుటుంబానికి అండగా నిలవండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):మూడు నెలలకు ముందు రామకుప్పం మండలానికి చెందిన ఓ రజక మైనర్ బాలిక ఓ కామాంధుడి చేతిలో గర్భవతి అయిన తరువాత 20 రోజుల క్రితం ఒక మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే.బిడ్డను శిశు విహార్‌కు అప్పగించి ఆ మైనర్ బాలికను తల్లిదండ్రుల వద్దకు పంపించారు. ఈ సంఘటనపై బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ షణ్ముగం మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వివరించారు. మూడు రోజుల్లోపు బాధిత కుటుంబానికి నివేశ స్థలం, హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని రామకుప్పం తహసీల్దార్‌కు కలెక్టర్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారని షణ్ముగం తెలిపారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

చౌడేపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యేక గుర్తింపు కార్డుల కోసం డిసెంబరు 26 నుంచి రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఏవో జ్యోతి తెలిపారు. భూమికి చెందిన 1బి, ఆధార్‌కార్డు, పాసుపుస్తకం జిరాక్స్‌లతో పాటు ఆధార్ లింక్ చేసిన సెల్‌ఫోన్‌తో సంప్రదించాలన్నారు. రైతుకు ప్రత్యేక యూనిక్ ఐడీతో ప్రభుత్వ పథకాలు పొందుతారని.. ప్రతిఒక్కరూ సద్వినియోం చేసుకోవాలని కోరారు.

నంజంపేటలో క్రికెట్ పోటీలు

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంజంపేట హైస్కూల్‌లో ఈనెల 28, 29 తేదీలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు అనూబేగ్ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న హైందవ శంఖారావం సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని వీహెచ్‌పీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కందూరు, నెల్లిమంద, వల్లిగట్లపంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటా కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గం వీహెచ్‌పీ నాయకులు కుమార్, నరసింహారెడ్డి, హేమగిరి, గోపి తదితరులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమల-చౌడేపల్లె మార్గం నడింపల్లె క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నంజంపేటకు చెందిన ఆనంద్, పద్మావతమ్మలు ద్విచక్రవాహనంలో ఈ.నడింపల్లెకు వెళుతుండగా క్రాస్ రోడ్డులో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో ఆనంద్, పద్మావతమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. సోమల పీహెచ్‌సీలో చికిత్స అనంతరం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

31 వరకు పంట బీమా పొడిగింపు

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులతో సాగులో ఉన్న పంటలను కోల్పోయి నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ఫసల్ బీమా యోజన చెల్లించడానికి ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. ప్రకృతి విపత్తులతో పంటలకు నష్టం జరిగితే ఎకరా వరికి రూ.42 వేలు, వేరుశనగకు రూ.32 వేలు, మామిడికి రూ.45 వేలు, టమోటాకు రూ.32 వేలు బీమా మార్గదర్శకాలు రూపొందించారన్నారు. మీసేవా కేంద్రాల్లో బీమాప్రీమియం చెల్లించాలని తెలిపారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

సోమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పి.చెరుకువారిపల్లె వద్ద సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సోమల ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సోమల పోలీసులు పి. చెరకువారిపల్లె వద్ద సారా విక్రయిస్తున్నట్లు సమాచారంతో ఆనంద్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద 30 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆనంద్ సారా తయారీ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి చెరువు ఆయకట్టు రైతుల కు అందుబాటులో ఉండేలా జరుగుతున్న రోడ్డు పనులను ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. లింగాపురం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఏపీవో మురుగేషన్ పాల్గొన్నారు.


పేకాటరాయుళ్ల అరెస్టు

రామకుప్పం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణరాజపురం సమీపంలోని మామిడి తోటలో పేకాట శిబిరంపై రామకుప్పం పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పుంగనూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. జనవరి 21 లోపు రైతులు ఆధార్ కార్డు, భూమి వివరాలు, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్‌తో రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకొని ఐడీ నంబర్ తీసుకోవాలని కోరారు. కొంతమంది రైతుల భూముల వివరాలు ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్‌కు లింక్ కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందలేదన్నారు. రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనసేన మండల పార్టీ అధ్యక్షుడు విరూపాక్షి జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో పుట్టినరోజు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీకాంత్, సీవీరెడ్డి, గంగరాజు, శివకుమార్‌రెడ్డి, పగడాల రమణ, నరేంద్రరెడ్డి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎంకు వినతి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న సప్తగిరి ప్రసాద్

తవణంపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గం పరిధిలో గల ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మంగళవారం తాడేపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పూతలపట్టు నియోజకవర్గానికి గృహ నిర్మాణ పథకం కింద 25 వేల గృహాలు మంజూరు చేయాలని, తిరుపతి నుంచి రామేశ్వరం వెళ్లే ట్రైన్‌కు చిత్తూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, కాంపిటేటివ్ ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, బంగారుపాళ్యం డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ మిషన్లు 20కి పెంచాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపించాలని సీఎంకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ఆ భూమి గుడిదా.. ధర్మకర్తదా.. తేల్చండి


తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న గ్రామస్థులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాశేపల్లెలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయానికి 15 ఏళ్ల క్రితం వరకు రెవెన్యూ రికార్డుల్లో సుమారు ఐదెకరాల భూమి గుడిమాన్యంగా ఉండేదని, ఆ తర్వాత ధర్మకర్త కోదండ రెడ్డి పేరుతో ఈ భూమి ఎలా మార్పిడి జరిగిందో నిగ్గుతేల్చాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మండలంలోని వరత్తూరు పంచాయతీ కాశేపల్లె, పాచిగుంట గ్రామాల్లో మంగళవారం రెవెన్యూసదస్సులు జరిగాయి. కాశేపల్లెలో గ్రామస్థులు తహసీల్దార్ చంద్రశేఖర్‌తో మాట్లాడుతూ ఈ భూమి గుడిమాన్యంకు చెందినదా.. ధర్మకర్త కోదండరెడ్డికి చెందినదా తేల్చాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ భూమిపై దేవదాయ శాఖ అధికారులు నుంచి ఫిర్యాదు వచ్చిందని, దానికి సంబంధించిన రికార్డులు సమర్పించాలని ధర్మకర్త కోదండరెడ్డికి నోటీసులు జారీచేశామన్నారు. ఆయన సమర్పించే రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు, దేవదాయ శాఖ అధికారులకు నివేదికలు పంపిస్తామని తహసీల్దార్ గ్రామస్థులకు తెలిపారు. గత ప్రభుత్వంలో వరత్తూరు వీఆర్వోగా పనిచేసిన శివాజి రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆ గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. ఈకార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, ఆర్ఐ ఏకాంబరం, వీఆర్వోలు కందస్వామి, కుమార్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


దర్గాసర్కిల్ వద్ద ర్యాలీగా వస్తున్న బీఎస్పీ నాయకులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే ఆ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్లమెంటులో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం దర్గా కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మనుధర్మం ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులను అందలమెక్కిస్తూ శూద్రులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా అమిత్‌షా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి


జాతీయ వినియోగదారుల పోస్టర్‌ను విడుదల చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ తదితరులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మోసపూరిత ప్రచారాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ సూచించారు. మంగళవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం కోసం 1986 డిసెంబరు 24న మొదటిసారిగా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ-కామర్స్ డిజిటల్ వర్తకంపై వినియోగదారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారని, ఆన్‌లైన్ కొనుగోలు సమయంలో గుర్తింపు పొందిన వెబ్‌సైట్ ద్వారా సురక్షిత కొనుగోలు చేయాలని, మోసపూరిత ప్రకటనలు నమ్మరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు, వినియోగదారుల సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

ప్రాణాలను రక్షించే కవచం హెల్మెట్ : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షించే కవచం హెల్మెట్ అని, ప్రతి ఒక్కరూ ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అన్నారు. మంగళవారం సీతమ్స్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. అనంతరం పోలీసులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన సమావేశంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఈస్ట్ సీఐ శ్రీనివాసరావు, ఎంవీఐలు మురళీ, శివకుమార్, ప్రిన్సిపాల్ వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి : బీజేపీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న గన్నవరంలో చేపట్టే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సత్యనారాయణపురంలో శంఖారావం కరపత్రికను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు రామ్మూర్తి, శివకుమార్, హరినాథ్, భాస్కర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


హైందవ శంఖారావం కరపత్రికను విడుదల చేస్తున్న బీజేపీ శ్రేణులు

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

వేడుకల నిర్వహణకు ముస్తాబైన చర్చిలు



చిత్తూరు టౌన్ చర్చి, క్యాథలిక్ చర్చిలకు విద్యుద్దీపాలంకరణ


చిత్తూరు క్యాథలిక్ చర్చిలో ప్రార్థనలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించుకోనున్నారు. ఈ మేరకు చర్చివీధి సీఎస్ఐ టౌన్ చర్చి, పలమనేరు రోడ్డు క్యాథలిక్, బీటీ కాంపౌండ్, ఇరువారం, సంతపేట, టాప్‌లైన్, చామంతిపురం, జానకారపల్లె, కొంగారెడ్డిపల్లె, రీడ్స్‌పేట, గిరింపేట తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ఏర్పాట్లు చేశారు. వేడుకల నిర్వహణకు చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు.

చిత్తూరు సెంట్రల్: నగరంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయం విద్యా సంస్థల్లో అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి ఆధ్వర్యంలో చిన్నారులు శాంతాక్లాజ్ దుస్తులు ధరించి సందడి చేశారు. బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో చిన్నారులు బాలయేసు, శాంతాక్లాజ్ వేషధారణలో ప్రదర్శించిన నాటికలు అలరించాయి. న్యూయార్క్ స్కూల్లో చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో చిన్నారులు మరియమ్మ, యేసుక్రీస్తు, గొర్రెల కాపరులు, శాంతాక్లాజ్ వంటి వస్త్రధారణలతో వేసిన నాటికలు ఆకట్టుకున్నాయి. యాజమాన్యాలు పాఠశాలల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచడంతో పాటు పలువురికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: నలగాంపల్లె సీఎస్ఐ చర్చి, మాధవనగర్‌లోని జీసెస్ బ్లెస్సింగ్ చర్చి, రాగిమానుపెంట రోడ్డులో ఉన్న సీఎస్ఐ చర్చి, తగ్గువారిపల్లెలోని కార్నర్‌స్టోన్ చర్చి, ముంగరమడుగులోని క్రీస్తుమందిరం, ఎర్రాండ్లపల్లె, రాగిమానుపెంట, బండ్లదొడ్డి, కీరమంద, కరిడివారిపల్లె, తుంబకుప్పం, కేజి సత్రం, గుండ్లకట్టమంచి గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.


విద్యుద్దీపాలంకరణలో ఆముదాల చర్చి, పన్నూరులో చర్చి, నగరి - నాగలాపురం రోడ్డులో సీఎస్ఐ చర్చి

పాలసముద్రం: మండలంలోని ఆముదాల, బాలకృష్ణాపురం, వీర్లగుడి, వెంగళరాజుకుప్పం, దీనబంధుపురం, బలిజకండ్రిగ, పాలసముద్రం, సింహరాజుపురం, తిరుమలరాజుపురం గ్రామాల్లోని చర్చిలను క్రైస్తవ సోదరులు విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి చర్చిల్లో వేడుకలు నిర్వహించారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో సీఎస్ఐ చర్చి, విజయపురం, ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ, మాధవరం, ఆలపాకం, జీఎంపురం, ఇళ్లత్తూరు, కేవీపురం, కళియంబాకం చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలో క్రైస్తవులు ఇంటి ముందు స్టార్‌లైట్‌ను వేలాడదీశారు. వీధుల్లో క్రిస్మస్ తాత వస్త్రారని సంబరాలు చేశారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో బుధవారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు ప్రార్థన మందిరాలనువిద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రధాన చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి.

నగరి: నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో క్రిస్మస్ సంబరాలకు పలు చర్చిలు ముస్తాబయ్యాయి. నగరి మేరీ మాత చర్చి, నాగలాపురం రోడ్డులోని సీఎస్ఐ చర్చితో పాటు పలు చర్చిలు విద్యుత్ దీపాలంకరణలతో కోలాహలంగా కనిపిస్తున్నాయి.


గంగాధరనెల్లూరు మండలం వేల్కూరులో శాంతాక్లాజ్ వేషధారి ట్రాక్టర్‌పై ఊరేగింపు


గంగాధరనెల్లూరు దళితవాడలో, ఠాగుండ్రం దళితవాడలో విద్యుద్దీపాలంకరణలో చర్చిలు


చిత్తూరు విజయం స్కూల్లో, న్యూయార్క్ స్కూల్లో, బృందావన్ స్కూల్లో శాంతాక్లాజ్ వేషధారణలో విద్యార్థులు - బంగారుపాళ్యంలో విద్యుత్ దీపాలకాంతులతో ముస్తాబైన చర్చి

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లను పంపిణీ చేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని న్యూ కయనికట్టు వీధిలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు మంగళవారం మేయర్ అముద దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలం ప్రారంభం కావడంతో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జోసఫ్‌రాజు పాల్గొన్నారు.

నాటు బాంబుల విక్రేత అరెస్టు

గుడిపాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాటు బాంబులను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బసవాపల్లె పంచాయతీలోని రెట్టగుంటకు చెందిన వేలు నాటు బాంబులను విక్రయిస్తున్నాడనే సమాచారం రావడంతో తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి ఏడు బాంబులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇతడు తమిళనాడులోని కరసమంగళం నుంచి నల్లమందు తీసుకొచ్చి ఇంటి వద్దే బాంబులు తయారు చేసి అడవి జంతువులను చంపుతున్నాడని తెలిసిందన్నారు. అనంతరం చనిపోయిన జంతువుల మాంసాన్ని విక్రయించేవాడని తెలిపారు.అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

సారా స్వాధీనం

నగరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడ సమీపంలో రాజుగుంట వద్ద 5200 లీటర్లు, కొప్పేడు పరిసర ప్రాంతాల్లో 1000 లీటర్ల సారా ఊటను ఎన్‌ఫోర్సుమెంటు, ఎక్సైజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. చిత్తూరు ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్, ఏఈఎస్ ఎన్‌ఫోర్సుమెంటు, నగరి ఎక్సైజ్ శాఖ మంగళవారం నిర్వహించిన దాడులలో సత్రవాడలో ఒక వ్యక్తి వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సారా తయారీ గురించి తెలిసిన వారు 94409 02549 అనే నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

ఘనంగా యంజీఆర్ వర్ధంతి



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక యంజీఆర్ వీధిలో మంగళవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, చలనచిత్ర నటుడు యంజీ రామచంద్రన్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాడీఎంకే రాష్ట్ర డిప్యూటీ సెక్రటరి రఫూఫ్ బక్కర్ ఆధ్వర్యంలో యంజీఆర్ అభిమానులు, అన్నాడీఎంకే కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. అదేవిధంగా సంతపేట రాగిమాను చెట్టు వద్ద కందా ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికే సదస్సులు


మాట్లాడుతున్న గిరిధర్‌బాబు

ఐరాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు అన్నారు. మంగళవారం ఐరాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐరాలలో 89 మంది భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణవతి, ఎంపీపీ మోహన్, తహసీల్దార్ మహేష్‌కుమార్, బీరప్ప చెరువు నీటి సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మెరుంపల్లె నీటి సంఘ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఆత్మ మాజీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని కావేరిరాజుపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తహసీల్దార్ అరుణకుమారి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఆనంద్, ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వో శివయ్య రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక రక్షకుడి కరుణతో అందరూ ఆనందంగా ఉండాలి


చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా పెద్ద ఎత్తున జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, లోక రక్షకుడైన ఏసు ప్రభు కరుణతో అందరూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నింద్ర మండలం, పాదిరి దళితవాడలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరావు, రఘుయాదవ్, చిట్టిబాబు, నంద, రఘు, హరి, బాబుయాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అధికార అండతోనే ఒకరి భూములు మరొకరికి


గుడిపాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అధికార అండతో ఒకరికి చెందిన భూమిని మరొకరికి రాసిచ్చారని రైతులు తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం మండలంలోని ఖైదుగాని కండ్రిగలో తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ అధికారులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై అర్హులైన రైతు భూమిని అర్హతలేనివారికి విస్తీర్ణం నమోదు చేశారన్నారు. దీనికి తోడు పశువుల మేత భూమిని కబ్జా చేసి మొక్కలు నాటారని చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యుగంధర నాయుడు, జనసేన మండల ఉపాధ్యక్షులు కేశవులు నాయుడు, వీఆర్వో రాధిక, సెక్రటరీ మౌళి,తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డీసీసీ అధ్యక్షులు భాస్కర్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అవహేళనగా మాట్లాడిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ విధానాలతో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రపంచమే గర్వించే అంబేడ్కర్‌ను పార్లమెంటులో అమిత్‌షా తూలనాడటం హేయమైన చర్య అన్నారు. అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడికి సన్మానం


ధనుంజయయాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట ఈశ్వర్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్

విజయపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయపురానికి చెందిన రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్‌ను మంగళవారం అనంతపురంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ఈశ్వర్‌ప్రసాద్ సన్మానించి అభినందించారు. సర్పంచుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు యలమంచిలి రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీముత్యాలరావు, ప్రధానకార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు హేమభూషణ్‌నాయుడు, మునిరెడ్డి, ఇస్మాయిల్, కృష్ణమూర్తితదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గంగాధరనెల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు వేర్వేరు గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పర్యటించారు. గంగాధరనెల్లూరు పంచాయతీ నల్లరాళ్ళపల్లె వద్దగల హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలించారు. కోటాగరం గ్రామం, దళితవాడకు త్వరలో కొత్తబోరు డ్రిల్లింగ్‌కు చేయాలని, అంతవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి శివయ్యను ఆదేశించారు. వేపంజేరి పంచాయతీ చెన్నారెడ్డిపల్లె ఎస్టీకాలనీలో మౌలిక సదుపాయాలపై పంచాయతీ కార్యదర్శి బావన, గ్రామస్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మామిడి రైతులకు టీటీడీ సహకారం అందించాలి

● చైర్మన్‌కు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మామిడి పంటపై ఆధారపడిన రైతాంగానికి టీటీడీ సహకారం అందించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీటీడీ పాలకమండలి సమావేశానికి హాజరైన టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావును కలిసి మామిడి రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులంతా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని చెప్పారు. టీటీడీ భక్తులకు అన్నప్రసాదంతో పాటు మామిడి జ్యూస్‌ను పంపిణీ చేయాలని సూచించారు. క్యూలైన్లు, నడకదారుల వద్ద జ్యూస్‌ను పంపిణీ చేస్తే రైతులకు కొంత ఆర్థిక భరోసా ఇచ్చినవారవుతామన్నారు.

వరసిద్ధుడి సేవలో మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ కార్యదర్శి

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ కార్యదర్శి హర్షవర్ధన్ మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

రజక బాలిక కుటుంబానికి అండగా నిలవండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ముందు రామకుప్పం మండలానికి చెందిన ఓ రజక మైనర్ బాలిక ఓ కామాంధుడి చేతిలో గర్భవతి అయిన తరువాత 20 రోజుల క్రితం ఒక మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. బిడ్డను శిశువిహార్‌కు అప్పగించి ఆ మైనర్ బాలికను తల్లిదండ్రుల వద్దకు పంపించారు. ఈ సంఘటనపై బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వివరించారు. మూడురోజుల్లోపు బాధిత కుటుంబానికి నివేశస్థలం, హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని రామకుప్పం తహసీల్దార్‌కు కలెక్టర్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారని షణ్ముగం తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జడ్జి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది మద్యం సేవించి వాహనాలు నడపడంతో వారిపై కేసు నమోదు చేశారు. మంగళవారం వారిని జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరచగా, ఆమె ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు.

డిటెన్షన్ రద్దుతో పేద పిల్లలకు విద్య దూరం : యూటీఎఫ్



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డిటెన్షన్ విద్యా విధానాన్ని రద్దుచేయడంతో పేదపిల్లలకు విద్య దూరం కానుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా డిటెన్షన్ విద్యను దూరం చేయడం వంటి నిర్ణయాలు సరికాదని, దీని ద్వారా ఎంతో మంది పిల్లలు నష్టపోతారన్నారు. దీన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అనంతరం విద్యావ్యవస్థలోని పలు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు రమణ, సుధాకర్‌రెడ్డి, రెడ్డప్ప, రెహనా బేగం, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

వెదురుకుప్పం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈవోపీఆర్డీ పురుషోత్తం మాట్లాడుతూ కిశోరి బాలికల ఆరోగ్యం, పోషణ, విద్య తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఉప తహసీల్దార్ కోమల, ఉద్యోగులు హాజరయ్యారు.